నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 17 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

బోరు ఎండిపోవడంతో ట్యాంకర్ నీటిని పొలానికి పారిస్తున్న రైతు దేవ్లా నాయక్

చివరికి తాపత్రయం

జూరాల ప్రాజెక్టులో అడుగంటిన నీటిమట్టం

- సీఎం సొంత జిల్లాలో యాసంగికి సాగునీటి కష్టాలు
- డ్యాం తలాపునే ఎండుతున్న వరి.. అయోమయంలో రైతులు
- ఆల్మట్టి నుంచి విడుదల కాని నీళ్లు
- కాంగ్రెస్ సర్కారుపై కర్షకుల కన్నెర్ర
- రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు
- మొఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వనపర్తి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : జూరాల ఆయకట్టు రైతులు ఆశలు అడుగంటుతున్నాయి. చేతికొచ్చిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే ఆవేదన చెందుతున్నారు. సాగునీళ్లిచ్చి పంటలు కాపాడాలని రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతుండగా, ఎమ్మెల్యేలు ముఖం చాటేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల తోపాటు ఆర్డీఎస్, కోయిల్ సాగర్ కూడా చివరి దశలో సాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో అన్నదాతలు అగమ్యగోచరంలో పడ్డారు. ఉమ్మడి జిల్లా వారీగా చూస్తే వ్యవసాయానికి జూరాల ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉన్నది. వానకాలం శిస్తు ముగిసిన అనంతరం యాసంగిలోనూ మళ్లీ వరి సాగుకు ప్రాధాన్యతనిచ్చారు. సమృద్ధిగా వర్షాలు, నిండుగా ఉన్న జూరాలను చూసిన రైతులు యాసంగిలో వరి నాటుకున్నారు. ప్రస్తుతం జూరాల కుడి కాల్వ కింద 25వేల ఎకరాలు శిస్తు జరిగితే, ఎడమ కాల్వ కింద 40వేల ఎకరాలు సాగు జరిగినట్లు అంచనా ఉన్నది. ప్రధానంగా ఎడమ కాల్వ కింద ఉన్న పొలాలు చాలా వరకు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయి. నీటి విడుదల పూర్తిగా నిలిచిపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో వేసిన పంటలు ఎండిపోతుంటే పట్టించుకోరా అంటూ అన్నదాతల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి.


జూరాల ఎడమ కాల్వ కింద ఎండుతున్న వరి

పాలకుల నిర్లక్ష్యంతోనే..

యాసంగి సాగుపై పాలకులు ముందు నుంచి నిర్లక్ష్యంగా ఉన్నారు. ప్రతి యేటా జరగాల్సిన ఐఏబీ మీటింగ్‌ను ఏర్పాటు చేయక పోవడం, ఎవరివారు అన్నట్లుగా వ్యవహరించడం వల్లే నేడు రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. ముందుస్తుగా సమావేశం ఏర్పాటు చేసి రైతులు, అధికారులు, ఎమ్మెల్యేలు చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటే ఇలా జరిగి ఉండేది కాదన్న విమర్శలు వెలువెల్తుతున్నాయి. యాసంగి సాగుకు రైతులు సిద్ధమైన అనంతరం చివరి దశలో ఇరిగేషన్ అధికారుల ద్వారా పత్రికల్లో ప్రకటనలు చేయించి ఎమ్మెల్యేలు గుట్టుగా ఉన్నారు. దాని ఫలితమే నేడు చివరి దశలో ఉన్న పంటలన్నీ ఎండిపోతున్నాయి. జూరాలకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామాల పంటలు సైతం ఎండుముఖం పట్టాయి. గతంలో ఇంతటి నిర్లక్ష్యాన్ని చూడలేదని రైతులు వాపోతున్నారు. ముందుస్తు సమాచారం ఇవ్వకుండా సాగు చేసిన అనంతరం తైబంది, వారబంది అంటూ ప్రకటనలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆల్మట్టి నీళ్లెక్కడ..?

మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు కర్ణాటకు వెళ్లి 4టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయిస్తామని అప్పట్లో ప్రకటనలు చేసినా పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకు అడపాదడపా ఒక్క టీఎంసీ నీరు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇంకా 3 టీఎంసీల నీటిని విడుదల చేయించాల్సి ఉన్నది. ఆయకట్టు పంటలన్నీ ఎండిపోతుండగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంటలు ఎండుతున్నా.. తమ బాధను రోడ్లపైకి వచ్చి వెల్లడించినా ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులు కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ప్రశ్నిస్తే చివరకు పోలీసులను పంపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. వరుస ధర్నాలతో కాల్వల వెంట రైతులు పాకులాడుతున్నారు. మీరు చెప్పిన ఆల్మట్టి నీళ్లు ఎక్కడంటూ కనిపించిన వారినంతా రైతన్నలు అడుగుతున్నారు. జూరాల గేట్లకు మరమ్మతులు చేపట్టక పోవడంతో లీకేజీలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారిస్తే నీరు ఆదా అయ్యే అవకాశం ఉన్నది.

> **రైతులను పట్టించుకోవడం లేదు**
> ఐదెకరాల్లో వరిపంట సాగుచేసిన. పంట చేతికి రావాలంటే ఇంకా రెండు తడులు అవసరమవుతాయి. జూరాల కాల్వ కిందనే నా పొలం ఉంది. పక్క పొలం రైతు బోరుతో నీటి కోసం ప్రయత్నిస్తున్నా. నీటి తడులు అందకుంటే నిండా మునగాల్సిందే. అప్పులపాలై అవస్థలు పడుతాం. జూరాలకు ఇంత దగ్గర ఉండి నీటికి ఇబ్బందులు పడుతున్నాం. బీఆర్ఎస్ సర్కారులో ఎన్నడూ ఇంత ఇబ్బంది రాలే. ధర్నాలు చేసినా ఎవరూ పట్టించుకుంటలేరు. ప్రభుత్వం ఇట్లనే ఉంటే రైతులు నష్టపోవాల్సిందే. ఇప్పటికైనా స్పందించి రెండు తడులకు నీళ్లు ఇవ్వాలి.
> - శ్రీనివాసులు, రైతు, ఖానాపురం, ఆత్మకూరు మండలం

క్వారీలో ముగ్గురు చచ్చినా పట్టదా?

- అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధ్యత లేదా?
- బాధిత కుటుంబాలను ఆదుకోవాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మృతుల కుటుంబాలకు ఓదార్పు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 : క్వారీలో పడి ముగ్గురు యువకులు చనిపోతే కనీసం వారి కుటుంబాలను పరామర్శించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టింపులేనట్లు వ్యవహరించడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో క్వారీలో పడి మృతిచెందిన ముగ్గురు యువకుల మృతదేహాలను పరిశీలించి దివిటిపల్లిలోని మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు క్వారీలో పడి ముగ్గురు యువకులు చనిపోతే కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఏం జరిగింది, వారి కుటుంబాల పరిస్థితి ఏమిటనే మానవత్వం లేకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ప్రమాదమని తెలిసి క్వారీ చుట్టూ ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ సర్కారులో చిన్న జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అయినప్పటికీ అధికారులు కనీసం చనిపోయిన కుటుంబాలను పరామర్శించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు పర్యటించాలంటే మరెవరి నుంచైనా అనుమతి తీసుకోవాలని అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాలను పరామర్శించి వారిని ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే వెంటనే క్వారీని పూడ్చివేయాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు జరిగితే ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్ గౌడ్, దేవేందర్‌రెడ్డి, శివరాజ్, రాఘవేందర్ గౌడ్, అంబదాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

మృతుల ఇండ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రజతోత్సవ సభకు సైన్యంలా కదలాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్, ఏప్రిల్ 16 : వరంగల్‌లో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణ సమీపంలో బుధవారం రజతోత్సవ సభకు సంబంధించి వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని చిట్టెం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2001 ఏప్రిల్ 27వ తేదీన కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారన్నారు. అనాదిగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించి అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి చావుదాకా వెళ్లి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు ప్రజా సంక్షేమ పాలన అందించడమే కాకుండా తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిపినట్లు గుర్తుచేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ గులాబీ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీని స్థాపించి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 27న వరంగల్‌లో చేపట్టే రజతోత్సవ మహాసభకు మక్తల్ నియోజకవర్గంలోని గులాబీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత కొత్త శ్రీనివాస్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, మాగనూరు మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు శంకర్, నర్సింహారెడ్డి, సాగర్, ఆనంద్ పాల్గొన్నారు.

సభ వాల్ పెయింటింగ్ వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

పంటలెండుతున్నా పట్టించుకోరా?

- బీఆర్ఎస్ నేత రవికుమార్‌యాదవ్
- తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమరచింత, ఏప్రిల్ 16 : ఆత్మకూర్ మండలంలోని జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరెపల్లి, కత్తెపల్లి తదితర గ్రామాల రైతుల పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే జూరాల ఎడుమ కాల్వ ద్వారా డీ-6 కెనాల్ సాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై అరగంటపాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రాజెక్టులో నీళ్లు పుష్కలంగా ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించి ఇప్పుడు కాల్వ సమీపంలో ఉన్న రైతులకు సాగు నీరు విడుదల చేయకుండా ఇబ్బందులు కలిగిస్తున్నారని మండిపడ్డారు. యాసంగి పంట సాగు చేసిన రైతులకు ఏప్రిల్ చివరి వరకు సాగు నీటిని విడుదల చేస్తామని చెప్పి చివరికి నిండా ముంచారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్కారు కళ్లు తెరిచి సాగు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మాజీ ఎంపీపీ విరేశలింగం, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, బీఆర్ఎస్ నాయకులు మాసన్న, ఆనంద్, లక్ష్మణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకుంటాం.. సాగునీళ్లివ్వండి

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి రైతుల విజ్ఞప్తి

ఎమ్మెల్యే శ్రీహరిని వేడుకుంటున్న రైతులు

అమరచింత, ఏప్రిల్ 16 : అప్పుసొప్పు చేసి వరిపంటలు సాగు చేసినం. పంటలు చివరి దశకొచ్చినయి. రెండు వారాలు సాగునీళ్లు వదిలితే తమ పంటలు చేతికొస్తయి.. మీ కాళ్లు మొక్తం సాగునీళ్లు ఇవ్వండి సారూ అంటూ ఆత్మకూర్ మండలం గుంటిపల్లి రైతులు ఎద్దుల లక్ష్మయ్య, మాసన్న ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. బుధవారం ఆత్మకూర్ పట్టణంలోని సాయిబాబా మందిరంలో 25 వార్షికోత్సవం సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూజలు చేసి బయటకు వచ్చిన క్రమంలో రైతు లక్ష్మయ్య ఎమ్మెల్యే కాళ్లపై పడేందుకు రాగా, ఎమ్మెల్యే వారించి జూరాల నుంచి సాగునీళ్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు లక్ష్మయ్య, మాసన్న మాట్లాడుతూ ఇన్నాళ్లు కష్టపడి సాగుచేసి సరి పంట చివరా ఖరున ఎండిపోతుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, సాగునీళ్లి తమను గట్టెక్కించాలని కోరారు.

యాసిడ్ తాగి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- కోయిలకొండ కస్తూర్బా పాఠశాలలో ఘటన
- విచారణ చేపట్టిన డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 : కోయిలకొండలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అంబేద్కర్ జయంతి రోజు విద్యార్థిని యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కేజీబీవీలోనే కొత్తగా నిర్మాణం చేపడుతున్న జూనియర్ కళాశాల భవనంలో కార్మికులు పనులు చేస్తున్నారు. సోమవారం అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఫోన్‌ను కస్తూర్బాలో చార్జింగ్ పెట్టి పనులు చేస్తుండగా, ఫోన్ రావడంతో విద్యార్థిని గుర్తించి వారికి ఇచ్చింది. ఈ విషయం క్రాఫ్ట్ ఉపాధ్యాయులు భీమమ్మ దృష్టికి రావడంతో బయటి వ్యక్తులతో మాట్లాడొద్దని, ప్రవర్తన మార్చుకోవాలని, లేదంటే తల్లిదండ్రులకు చెప్పి టీసీ ఇచ్చి పంపిస్తానని హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని పాఠశాలలో బాత్రూం కడిగే యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తోటి విద్యార్థులు గుర్తించి చికిత్స కోసం బాలికను మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు తరలించారు. ఆరోగ్యం కుదుటపడ్డాక బాలిక తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లింది. డీఈవో ప్రవీణ్‌కుమార్ బుధవారం కోయిలకొండ కేజీబీవీకి చేరుకొని విచారణ చేపట్టారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

నకిలీ పత్తి విత్తనాలతో ఎస్సై, ఏవో

మల్దకల్, ఏప్రిల్ 16 : మండలంలోని కుర్తిరావుల చెర్వు గ్రామంలో నకిలీ విత్తనాలను పట్టుకున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు, ఎస్సై నందికర్ తెలిపారు. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ శ్రీను అలియాస్ రాజు వ్యక్తి తన వ్యవసాయ బావి వద్ద గల షెడ్డులో 1,275 కేజీల పత్తి విత్తనాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో ఏవో రాజశేఖర్, ఎస్సై నందికర్ పోలీసు సిబ్బందితో బుధవారం దాడులు చేశారు. షెడ్డులో విత్తనాలు దొరకడంతో ట్రాక్టర్‌లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్ నిరంజన్ ఉన్నారు.

ఉల్లి ధరలు తగ్గుముఖం

దేవరకద్ర, ఏప్రిల్ 16 : ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం వివిధ గ్రామాల నుంచి రైతులు ఉల్లిని విక్రయించేందుకు తీసుకొచ్చారు. మార్కెట్ అధికారులు వ్యాపారస్తులతో కలిసి టెండర్లు నిర్వహించగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.1,400, కనిష్ఠంగా క్వింటాకు రూ.800ల వరకు ధర పలికింది. ఉల్లి ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో ధరలు తగ్గుతున్నట్లు అధికారులు తెలిపారు.

రైతన్నకు గన్నీ గోస

- మక్తల్‌లో జాతీయ రహదారిపై అన్నదాతల ఆందోళన

ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సీఐ రాంలాల్

మక్తల్, ఏప్రిల్ 16 : ఆరుగాలం కష్టించిన పంటను అమ్ముకుందామంటే రైతుకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇన్నాళ్లు సాగు నీరు, కరెంట్ కష్టాలు ఎదురవగా.. కాస్తో, కూస్తో చేతికొచ్చిన పంటను అమ్ముకుందామంటే తిప్పలు తప్పడం లేదు. బుధవారం మక్తల్ పట్టణంలోని జాతీయ రహదారిపై పలువురు రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మక్తల్ మండలంలో ఈ యాసంగి సీజన్లో రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం మక్తల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కర్ని, పస్పుల, అనుగొండ, పారేవుల, మద్వార్, సంగెంబండ, ఐకేపీ ద్వారా మంతన్‌గౌడ్, జక్లేర్, భూత్పూర్ గ్రామాలను కలుపుతూ 9 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలు ఏర్పాటు చేసినా మక్తల్ సహకార సంఘం కార్యాలయ సిబ్బంది గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2లక్షల 50వేలకు పైగా గన్నీ బ్యాగులు అవసరముండగా, 50వేల సంచులు మాత్రమే ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో బ్యాగుల కోసం వారం రోజులుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందారు. ధర్నాతో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం కావడంతో విషయం తెలుసుకొన్న సీఐ రాంలాల్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. సహకార సంఘం అధికారులతో చర్చించి గన్నీ బ్యాగులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 16 : ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు తెలిపారు. మండలంలోని కొండేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే విజేయుడు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320 తోపాటు రూ.500 బోనస్ మొత్తం కలిపి రూ.2,820రూ రైతులకు ఇవ్వనున్నట్లు వివరాలు తెలిపే విధంగా చార్టును రూపొందించాలన్నారు.

ప్రోటోకాల్ పాటించని కాంగ్రెస్ నాయకులు..

ప్రోటోకాల్ ప్రకారం 9గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాల్సి ఉండగా, 8:30గంటలకే కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాక ముందే మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుక్మనందరెడ్డి, మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం కుర్మయ్య ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే వస్తున్నారని తెలుపగా ఏపీఎంతో వాదించి కాంగ్రెస్ నాయకులు ధాన్యం కొనుగోలు ప్రారంభించడం కోసం మెలుపు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కొండేరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆర్టీసీ ప్రైవేట్ బస్సు డ్రైవర్ల సమ్మె

అచ్చంపేట టౌన్/రూరల్, ఏప్రిల్ 16 : వేతనాలు ఇవ్వకుండా యజమానులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆర్టీసీ ప్రైవేట్ బస్సు డ్రైవర్లు బుధవారం అచ్చంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట సమ్మె చేపట్టారు. అచ్చంపేట డిపోలో 28బస్సులు ఉండగా, 60మంది డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, రోజుకు రూ.1,100 నుంచి రూ.1,600ల వేతనం పెంచాలని, యూనిఫామ్, ఫ్రీ పాస్ సౌకర్యం డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బస్సులను నిలిపి నిరసన తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఈ జీతాలతో జీవనం సాగించలేక పోతున్నామని వాపోయారు.

సమస్యలు పరిష్కరించాలి..

అచ్చంపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ప్రైవేట్ బస్సుల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు రాములు డిమాండ్ చేశారు. డ్రైవర్లు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు



ఓటీకి సమ్మర్ హాలిడేస్

- కోస్గి ప్రభుత్వ దవాఖానలో వైద్యాధికారుల నిర్వాకం
- వేసవి ముగిసే వరకు ఆపరేషన్ థియేటర్ బంద్
- సీఎం ఇలాకా సంఘటనపై అవాక్కైన జనం

కోస్గి, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్కారు వైద్యం గాలిలో దీపంలా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్లలో ప్రభుత్వ వైద్యంపై భరోసా కల్పిస్తే.. నేడు సక్రమంగా వైద్య సేవలు అందక 'నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖాన'కు అన్న చందంగా పరిస్థితి తయారైంది. దవాఖానలకు వస్తే సరైన వైద్య సేవలు, చికిత్సలు అందక.. డాక్టర్లు అందుబాటులో లేక.. సిబ్బంది, మందుబిల్లల కొరత.. పారిశుధ్య సమస్యలు ఇలా.. రోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ తరుణంలో చాలా మంది రోగులు ప్రైవేటు దవాఖానలను ఆశ్రయిస్తున్న పరిస్థితులు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉంటే.. ఇక సాక్షాత్తు సీఎం రేవంత్ ఇలాకాలో పరిస్థితి దారుణంగా తయారైంది. కోస్గి ప్రభుత్వ దవాఖానలో ఆపరేషన్లకు అక్కడి వైద్య సిబ్బంది ఏకంగా వేసవి సెలవులే ప్రకటించారు. 'ఓటీ విల్ బీ క్లోజ్‌డ్ ఫర్ టు మంత్స్ డ్యూ టు సమ్మర్' అంటూ పేపర్‌పై రాసి నోటీస్ బోర్డుపై అంటించారు. దవాఖాన లోపలికి వెళ్లగానే ముందుగా కనిపిస్తున్నది. ఇది చూసిన రోగులు, వారి బంధువులు ముక్కున వేలేసుకుంటున్నారు. విద్యాసంస్థలకు ఎండాకాలం సెలవులు ఇవ్వడం చూస్తుంటాం.. కానీ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే శస్త్రచికిత్సలకు ప్రభుత్వ దవాఖాన వైద్యులు వేసవి సెలవులు ప్రకటించడం విడ్డూరంగా ఉన్నది. ప్రైవేటును ఆశ్రయిస్తే జేబులు గుల్లవుతాయని.. ఆర్థిక స్థోమత లేని పేదలు సర్కారు వైద్యంపై నమ్మకంతో దవాఖానలకు వస్తుంటారు. కానీ ఇలాంటి విచిత్ర పరిస్థితులలో వాటిపై ఉన్న భరోసా కాస్తా పోతుందని పలువురు వాపోతున్నారు. గతంలో ఇక్కడి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కోస్గితోపాటు చుట్టుపక్కల గ్రామాల పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఇక్కడి 25 పడకల దవాఖానను 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయించారు. నాటి బీఆర్ఎస్ హయాంలో వైద్యసేవలను పేదల చెంతకు తీసుకొచ్చారు. నాటి సంకల్పం నేటి రేవంత్ సర్కారులో వైద్యాధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోన్నది.

> **పైఅధికారుల ఆదేశాలతోనే..**
> వేసవి కాలం కావడంతో పేషెంట్లు కార్డియాక్ కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నది.. అందుకే ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల రోజులు అన్ని అపరేషన్లు బంద్ పెట్టాం.. వీలైనంత త్వరగా మళ్లా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం..
> - డాక్టర్ అనుదీప్, సూపరింటెండెంట్, కోస్గి దవాఖాన